# కారంచేడు 'న్యాయం'

ఈ దేశంలో హరిజనులపై ఏదో ఒక అండ చూసుకుని దాడి చేయవచ్చు; ఆడవాళ్ళను చెరచెవచ్చు; ఇళ్ళు తగలబెట్టవచ్చు; మరింకా అనాగరికమైన పనికైనా పాల్పడవచ్చు, ఇంతచేసి కూడా నిర్దోషుల్లా సమాజంలో చెలామణి కావచ్చు. ఇంకా కావాలంటే బాధితుణ్ణే నిందితుణ్ని కూడా చేయొచ్చు. అప్పటికీ కోర్టులకు దోషిని సైతం నిర్దోషిగా ప్రకటించడానికి, కనీసం దోషిని దోషిగా తీర్పు చెప్పే రోజును మరింత దూరం చేయడానికి మన న్యాయ వ్యవస్థలోనే సవాలక్ష లొసుగులు! కారంచేడు కేసు విషయంలో ఈ లొసుగులు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. కేసును కోర్టువరకు తీసుకురావడం ఒకఎత్తు కోర్టుకు వచ్చిన దాన్ని కోర్టులో నిలపడం మరొక ఎత్తు.

చీరాల ప్రక్కనేగల కారంచేడులో దారుణ మారణహోమం జరిగిపోయి అప్పుడే రెండేళ్ళు దాటిపోయింది. ఈ కేసులో తీర్పు సంగతి అటుంచితే కేసుపై ఇంతవరకు విచారణ క్రమమే ప్రారంభం కాలేదు. కారంచేడు భూస్వాములు 1985 జూలై 17వ తేదీన ఆరుగురు అమాయక హరిజనులను చంపినప్పుడు పత్రికలు "పంట పొలాలలో పులి చంపిన లేడి నెత్తురు" అని పతాక శీర్షికలతో రాసిన వార్త ప్రభుత్వాన్ని కదిలించలేదు; పోలీసులనూ కదిలించలేదు. కారంచేడు సంఘటనకు బాధ్యులైన వారిని బాధితుల ద్వారా గుర్తించి, వారి పేర్లను ఎ. పి. సి. ఎల్ సి. పత్రికలకు విడుదల చేసిన తర్వాతే కాస్తో కూస్తో పోలీసు యంత్రాంగం దిగి వచ్చింది. ప్రభుత్వం సి బి సి ఐ డి దర్యాప్తుకు ఆదేశించింది. బాధితులందరూ మొదటి నిందితునిగా శ్రీ దగ్గుబాటి చెంచురామయ్య పేరు చెప్పారు. ఆ తర్వాతే మిగిలినవారి పేర్లు చెప్పారు. కాని ఆయన పేరు సి బి సి ఐ డి నివేదికలో అదృశ్యమైపోయింది. ప్రత్యక్ష సాక్షులు, బాధితులు చెప్పినపేరు ఎఫ్. ఐ. ఆర్.లో కూడా ఉండకపోయేసరికి ఇక పోలీసు కేసు వల్ల లభించే న్యాయం ఏమిటని దళిత నాయకులు ఆ కేసుకు నీళ్ళు వదులు కున్నారు. ప్రత్యామ్నాయంగా ఒక ప్రయివేటు కేసు వేశారు.

ఈ ప్రయివేటు కేసుకు సంబంధించినంత వరకు కోర్టు వ్యవహారం ఏదో ముందుకు నడుస్తున్నదనే అనిపిస్తుంది గాని వాస్తవానికి కేసు ఒక్క అడుగు కూడా ముందుకుపోలేదు. "చట్టం ముందు అందరూ సమానమే" కాబట్టి బాధితులకు, నిందితులకూ సమానంగా 'న్యాయం' జరిపించడానికి న్యాయవ్యవస్థ సహజంగానే ప్రయత్నిస్తున్నట్టుంది. ఫలితంగా బాధితులకు న్యాయం రోజు రోజుకూ దూరమైపోతోంది. కారంచేడు బాధితులకు ఒకరైన శ్రీ తేళ్ళ జెడ్సన్ మొత్తం 140 మందిపై కేసువేశారు. ఈ కేసు ప్రస్తుతం చీరాల అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు దశలో ఉంది. మామూలుగా అయితే అతిస్వల్ప వ్యవధిలో ఈ దశను అధిగమించి కేసు పై కోర్టులో అంటే సెషన్స్‌లో 'కమిటల్' కు రావలసి ఉంది. కేసు అలా కమిటల్‌కు రాకుండా చూడడానికి భూస్వాముల పక్షం న్యాయవాదులు న్యాయ శాస్త్రాన్ని తెగ తిరగ చదువుతున్నారు. చీరాల మూడవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో గల కేసును పరుచూరుకు బదలీ చేయించుకోవడానికి భూస్వాములు విశ్వ ప్రయత్నం చేశారు. ఈ కేసు గనక పరుచూరుకు బదలీ అయితే అప్పుడు కారంచేడు నిందితులకు పని 'తేలిక' అవుతుంది. బాధితుల తరపున ఎవరు కోర్టుకు వెళ్ళాలన్నా కారంచేడు మీదుగానే వెళ్ళాలి. అటువంటప్పుడు మరో దుర్ఘటన జరగదనే హామీ లేదు కాబట్టి కేసును బదలీ చేయరాదని ప్రయివేటు కేసులో బాధితుల తరపు న్యాయవాది శ్రీ బొజ్జా తారకం ఇంతకు ముందే వాదించడంతో కేసు చీరాలలోనే నిల్చిపోయింది.

ఈ మధ్య కాలంలో ఈ కేసు చాలాసార్లు విచారణకు వచ్చింది. జూన్‌లో జరిగిన విచారణలో ఒకసారి 140 మంది నిందితులకు గాను శ్రీ దగ్గుబాటి చెంచురామయ్యతో సహా 102 మంది కోర్టుకు వచ్చారు. అందరూ వస్తే కేసును కమిటల్‌కు పంపించవచ్చు ననుకుంటున్న మేజిస్ట్రేటు మిగిలిన 38 మందినీ "కోర్టుకు తీసుకువచ్చే బాధ్యత"ను పోలీసులకు అప్పగించారు.

ఈ బాధ్యతల అప్పగింత ఎప్పుడూ జరుగుతూనే ఉంది గాని నిందితులు అందరూ మాత్రం కోర్టుకు రావడంలేదు. రాని వాళ్ళ సంగతి ఏం చేశారని మేజిస్ట్రేట్ అడిగితే "జాడ తెలియడం లేదు" అన్నదే పోలీసుల జవాబు.

నిందితులకు సమన్లు, నాన్‌బెయిలబుల్ వారంట్లు సైతం జారీ అయ్యాయి. బాధితులకు ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్న నిందితులు పోలీసులకు మాత్రం కనిపించడం లేదట!

పోనీ నిజంగా కనిపించకపోతే, వారి చిరునామాలు దొరకకపోతే ఆయా వివరాలను లిఖిత పూర్వకంగా కోర్టుకు తెలియపరచవలసిన బాధ్యత పోలీసులదే. కాని ఇంతవరకు కారంచేడు పోలీసులు ఒక్కసారైనా లిఖిత పూర్వకంగా కోర్టుకు ఆయా కారణాలను వివరించిన పాపానపోలేదు. న్యాయ వ్యవస్థ చెప్పు చేతుల్లో తాము నడుచుకోవాలని గాక, న్యాయవ్యవస్థే తమ చెప్పు చేతల్లో నడుచుకోవాలన్నది పోలీసుల వైఖరి. మేజిస్ట్రేట్ మందలించినా పోలీసులు తమ వైఖరిని మార్చుకోవడం లేదు.

మేజిస్ట్రేట్ జారీచేసిన సమన్లను, నాన్ బెయిలబుల్ వారంట్లనూ ఆయా నిందితులకు అందజేయడానికి గాని, కోర్టుకు రావలసిన విధ్యుక్త ధర్మం వారికున్నదని గాని చెప్పడానికి పోలీసులు నామ మాత్రమైన ప్రయత్నం కూడా చేయడంలేదు. కేసు మళ్ళీ రెండవసారి జూన్ చివరి వారంలో విచారణకు వచ్చి

నప్పుడు మరి ముగ్గురు నిందితులు కోర్టుకు హాజరు అయ్యారు. మిగిలిన వారి కోసం మేజిస్ట్రేట్ మళ్ళీ ఎన్. బి. డబ్ల్యు. (నాన్ బెయిలబుల్ వారంట్లు) జారీ చేశారు. అప్పుడే కేసు విచారణను మళ్ళీ జూలై 16వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజున కోర్టులో ఇంకా గమ్మత్తయిన సంగతి జరిగింది. అంతకు ముందు వాయిదాకు 105 మంది నిందితులూ హాజరుకాగా ఈ సారి ఒక్కరు కూడా కోర్టుకు హాజరు కాలేదు. ఇప్పటివరకు సక్రమంగా కోర్టుకు వస్తున్న కారంచేడు నిందితులు ఈ సారి ఎందుకు రాలేదో మేజిస్ట్రేట్‌కు కూడా ఆశ్చర్యం కలిగించింది. ఈ కేసు పట్ల ఎంతో ఆసక్తితో అక్కడికి వచ్చిన వారితో పాటు మేజిస్ట్రేట్‌కు కూడా అప్పుడే తెలిసిన సంగతి ఏమిటంటే మూడవ అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో గల ఆ కేసుపై ఒంగోలు సెషన్స్ న్యాయమూర్తి 'తాత్కాలిక స్టే' మంజూరు చేశారని! దీని మీద కోర్టులో కొంత గందరగోళ పరిస్థితి తలెత్తింది. అసలు విషయం కనుక్కుంటె మొత్తం 99 మంది నిందితులు తమకు చీరాల కోర్టు దగ్గర భద్రతలేదు కాబట్టి ఈ కేసును జిల్లాలో మరే కోర్టుకైనా బదలీ చేయాలని సెషన్స్ న్యాయమూర్తికి అప్పీలు చేసుకున్నారట. సెషన్స్ జడ్జి కేసుబదలీ సంగతి అటుంచి, "జూలై 17 సందర్భంగా భద్రతలేని పరిస్థితి" తలెత్తిందని నిందితులు విన్నవించుకున్నారు కాబట్టి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో జరుగుతున్న విచారణపై తాత్కాలిక స్టే మంజూరు చేశారు.

మొత్తం 140 మంది నిందితులలో అప్పటికి 105 మంది కోర్టుకు హాజరు అయ్యే వున్నారు కాబట్టి అందులో 99 మంది మాత్రమే సమర్పించుకున్న అప్పీలు ఆ మొత్తం 140 మందికి వర్తిస్తుందా లేక కోర్టుకు కనీసం ఒక్కసారైనా కనిపించిన 105 మందికి మాత్రమే వర్తిస్తుందా లేక ఈ 99 మందికి మాత్రమే వర్తిస్తుందా? జూలై 16వ తేదీన జరిగిన విచారణలో ఇది పెద్ద కొరకరాని కొయ్యగా తయారైంది. మొత్తం 140 మందికీ వర్తిస్తుందని నిందితుల తరపు న్యాయవాది, అప్పీలు చేసుకున్న 99 మందికి మాత్రమే వర్తిస్తుందని బాధితుల తరపు న్యాయవాది వాద ప్రతివాదనలు చేశారు. ఈ రోజున ఈ ఒక్క విషయం తేల్చడానికి కోర్టు 8 గంటలపాటు వాద ప్రతివాదనలు విన్నది. అంతా విని కోర్టు చెప్పిందేమంటే "మిగిలిన నిందితులను కూడా కోర్టుకు తీసుకువచ్చే బాధ్యతను పోలీసులకు గుర్తుచేసి, వారికి మరొక్క అవకాశం ఇద్దాం" అని.

ఇప్పటికి చాలాసార్లు ఆ అవకాశం ఇవ్వడం అయిపోయింది, పోలీసులు ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేయడమూ అయిపోయిందని వాది తరపు న్యాయవాది శ్రీ తారకం వాదించారు. చట్ట ప్రకారం కూడా ఇక జాప్యం తగదన్నారు. సి ఆర్ పి సి సెక్షన్ 82 క్రింద "ప్రొక్లమేషన్ అఫ్ అరెస్టు" ఒక్కటే శరణ్యం అన్నారు. ఈ సెక్షన్ క్రింద బుద్ధి పూర్వకంగా కోర్టుకు రాని వారిని, పరారీలో ఉన్న వారిని అరెస్టు చేయడానికీ, తర్వాత దశలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికీ చట్టరీత్యా అవకాశం కలుగుతుంది. ఆయా నిందితులు కనబడడం లేదంటూ వారి ఇంటి తలుపుల పైన, కోర్టులోనూ, పత్రికలలోనూ ప్రకటనలు వేయవలసి వస్తుంది. ఇన్నిసార్లు కోర్టుకు రాకుండా ఎగ్గొడుతున్న ఆ 35 మంది పైనా సెక్షన్ 82 క్రింద "ప్రొక్లమేషన్ అఫ్ అరెస్ట్" అస్త్రాన్ని ప్రయోగించాలని శ్రీ తారకం వాదించారు.

అలాగే కోర్టుకు ఆ రోజున రాని, పిటిషన్‌పై సంతకాలు చేయని మిగిలిన 41 మందీ సెక్షన్ 317 క్రింద కోర్టు అనుమతి లేకుండా కోర్టుకు గైరుహాజరు కారాదని శ్రీ తారకం వాదించారు. మేజిస్ట్రేటు ఆ వాదనతో ఏకీభవించారు. అయితే ఈసారికి చెప్పకుండా గైరుహాజరు అయిన వారిని, ఐదు రోజులనుంచీ "జ్వరంతో బాధపడుతున్నా" అ రోజే ఆ విషయాన్ని కోర్టుకు తెలియజేసిన శ్రీ చెంచురామయ్యనూ మన్నిస్తున్నట్లు మేజిస్ట్రేట్ ప్రకటించారు. పై కోర్టు ఇచ్చిన "తాత్కాలిక స్టే" పిటిషన్‌పై సంతకాలు చేయని 41 మందికీ వర్తించదని కూడా అయన ప్రకటించారు. తాత్కాలిక స్టే అగస్టు 17 వరకు అమలులో ఉన్న దృష్ట్యా, కేసు వాద ప్రతివాదనలను మళ్ళీ అగస్టు 24కు వాయిదా వేశారు.

ఇప్పటివరకు జరిగిన కథ ఇది. ఇందులో చిత్రం ఏమంటే కేసు బదలీకై ఒంగోలు సెషన్స్ కోర్టుకు పిటిషన్ పెట్టుకున్న 99 మందిలో ఇప్పటివరకు కోర్టు ముఖం చూడని, సమన్లుగాని, ఎన్. బి. డబ్ల్యు.లు గాని అందుకోని ప్రబుద్ధులు కనీసం ఇద్దరు ఉన్నారు! వారి జాడ తమకు తెలియనే తెలియదని ప్రపంచాన్ని నమ్మించ జూస్తున్నారు కారంచేడు పోలీసులు!

## మరి ముగ్గురు 'ఎన్‌కౌంటర్ల'లో మృతి

జూన్ 23వ తేదీ నిజామాబాద్ జిల్లాలో ఒకటి, 27వ తేదీ తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి, రెండు 'ఎన్‌కౌంటర్లు' అని పిలవబడేవి జరిగి ముగ్గురు నక్సలైట్ కార్యకర్తలు మరణించారు.

నిజామాబాద్ జిల్లా గౌరారం గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి అనే భూస్వామిని నక్సలైట్లు కాల్చివేయగా అతని గన్‌మాన్ జరిపిన 'ఎదురు కాల్పుల'లో కోటి భూమిరెడ్డి అనే నక్సలైట్ కార్యకర్త మరణించినట్టు పోలీసులు ప్రకటించారు. ఈ సంఘటన జూన్ 23 రాత్రి గౌరారం గ్రామంలో నారాయణరెడ్డి ఇంట్లో - అతను తన గన్‌మాన్‌తో మాట్లాడుతూండగా - జరిగిందని అన్నారు. అయితే కొందరు గ్రామస్తులు చెప్పే విషయం ఏమిటంటే గన్‌మాన్ వెంటనే 'ఎదురు కాల్పులు' జరపలేదనీ, నారాయణరెడ్డిని చంపేసి నక్సలైట్లు వెళ్ళిపోయారనీ, భూమారెడ్డిని పోలీసులు అటు తరువాత ప్రాణాలతో పట్టుకొని చంపేశారని. ఇందులో ఏది ఎంత విశ్వసనీయమో తెలీదు.

జూన్ 27 నాడు తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి సమీపంలో మరొక 'ఎన్‌కౌంటర్' జరిగింది. మారేడుమిల్లి మండలంలోని బొట్లవాడ దగ్గర జరిగిన 'ఎన్‌కౌంటర్'లో బాబు అనే కార్యకర్త గాయపడ్డాడని, కాకినాడ ఆస్పత్రిలో చేర్పించగా 29న చనిపోయాడని పోలీసులు ప్రకటించారు. అయితే కొన్ని రోజుల తరువాత వచ్చిన వార్తలో, చనిపోయింది ఒకరుకాదు, ఇద్దరని రాసారు. ఈ సంఘటనను వివరిస్తూ న్యూస్‌టైం (ఆంగ్ల దిన పత్రిక) జూలై 6వ తేదీన ప్రచురించిన వార్తను యధాతధంగా అనువదించి ఇక్కడ ఇస్తున్నాం. ఈ సంఘటన 'ఎన్‌కౌంటర్' కాదని, ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్య అని మేము వివరించ నక్కరలేకుండ వార్త దానంతటదే వివరిస్తుంది.

జూన్ 27న జరిగే మారేడుమిల్లి కలప వేలానికి కొందరు తీవ్రవాదులు హాజరవుతున్నారని తెలిసిన ఖమ్మం పోలీసులు వాళ్ళను పట్టుకోవడం కోసం మఫ్టీలో వున్న ఇద్దరు పోలీసులను అక్కడ నియమించారు. వేలం దగ్గరికి వచ్చిన ఇద్దరు తీవ్రవాదులు ఆ పోలీసులను గమనించి, గతంలో జరిగిన వేలాలకు మీరు రాలేదు, మీరెవ్వరు అని అడిగారు. పోలీసులు వారిలో ఒకరిని పట్టుకోబోగా అతను పారిపోయే ప్రయత్నం చేసాడు. పోలీసులు అతన్ని పట్టుకోవడం కోసం కాల్పులు జరిపారు. అతను గాయపడి కిందపడిపోయాడు. రెండవ తీవ్రవాది తీవ్రంగా గాయపడి తప్పించుకున్నాడు. చీకట్లో అతన్ని పట్టుకోలేక పోయారు. అయితే, అతను ఆ తరువాత చనిపోయాడనీ, అందువల్లనే ఈ 'ఎన్‌కౌంటర్'కు నిరసనగా చింతలపూడి దగ్గర మూడు లారీలను తగల బెట్టిన తీవ్రవాదులు ఇద్దరికి జోహార్లు చెపుతూ నినాదాలు ఇచ్చారనీ తెలుస్తోంది.

## 'నాగేశ్వరరావు తిరిగి వచ్చాడు'

"అచ్చయ్యనగర్ నాగేశ్వరరావు" రెండేళ్ళ తరువాత తిరిగి వచ్చాడు. 1985 మే 12న హైదరాబాద్ నగరంలోని చిక్కడపల్లి క్రైం బ్రాంచి పోలీసులచేత అరెస్టు చేయబడి, 15వ తేదీ దాకా అందరికీ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో కనబడి 16వ తేదీన సెర్చి వారంట్ తీసుకొచ్చిన క్షణం నుండి "కనబడకుండ" పోయిన నాగేశ్వరరావు 1987 జూన్ తేదీన అకస్మాత్తుగా తిరిగి వచ్చాడు. పోలీసులే అతనిని చంపేసి శవాన్ని "మాయం"చేసి ఉంటారని అందరూ భావించారు. చిక్కడపల్లి స్టేషన్ హవుస్ ఆఫీసర్ శ్యాంరావును హైకోర్టు అతని అదృశ్యానికి బాధ్యునిగా గుర్తించి అతని కుటుంబానికి 40,000 రూపాయలు ఇవ్వవలసిందిగా ఆర్డరు జారీ చేసింది. "మేము చంపలేదు మొర్రో! అతనే తప్పించుకొని పారిపోయాడ"ని పోలీసులు ఎంత మొత్తుకున్నా ప్రజలూ నమ్మలేదు, హైకోర్టూ నమ్మలేదు. శ్యాంరావు తరపున రాష్ట్ర ప్రభుత్వం ఆ మొత్తం హైకోర్టులో డిపాజిట్‌చేసి అపీల్ మీద సుప్రీంకోర్టుకు పోయింది.

ఇప్పుడు నాగేశ్వరరావు తిరిగి రావడంతో పోలీసులకు "అన్యాయం" జరిగినట్టు అనుకోవలసిందేనా? ఈ వార్తకు "పాపం పోలీసులు" అని శీర్షిక పెట్టుకుందామా? తొందరపడేముందు కొంచెం ఆలోచిద్దాం. చిన్న దొంగతనం కేసులో నిందితుడయిన నాగేశ్వరరావు ఈ రెండేళ్ళు ఊరొదిలి, ఇల్లొదిలి, తన వాళ్ళను వదిలి, ఎందుకు దాక్కున్నాడు? ఆ దొంగతనం కేసులో శిక్షపడినా మొదటి నేరంగా ఆరు నెలలకంటే ఎక్కువ పడేదికాదు. తనకు తాను రెండేళ్ళ శిక్ష ఎందుకు వేసుకున్నాడు? తానెంత మానసిక వ్యధ అనుభవించాడు, తన వాళ్ళెంత అనుభవించారు? అసలు, మే 15 దాకా చిక్కడపల్లి లాకప్పులో ఉన్నవాడు, 16వ తేదీన సర్చి వారంట్ తేగానే ఎట్లా మాయం అయ్యాడు?

ఈ ప్రశ్నలకు సమాధానాలు నాగేశ్వరరావే స్వయంగా చెప్పాడు. తమ దగ్గర ఎవరయినా అక్రమ నిర్బంధంలో ఉంటే, వాళ్ళకోసం సెర్చి వారంట్ తీసుకోగానే వాళ్ళను స్టేషన్ మార్చి "మేము అరెస్టే చేయలేదు" అనడం పోలీసులకు పరిపాటి. ఆ ప్రకారమే నాగేశ్వరరావుకు సెర్చి వారంట్ తీసుకోగానే చిక్కడపల్లి పోలీసులు అతన్ని వేరేచోట దాచిపెట్టారు. ఆ తరువాత అతన్ని వదిలిపెడుతూ ఆ స్టేషన్ ఎస్ హెచ్ వో. "ఇక కనబడితే చంపేస్తాము, పో" అన్నాడట సెర్చివారంట్ తీసుకున్నారన్న కసి కాబోలు నాగేశ్వరరావు, వాళ్ళు నిజంగానే చంపేస్తారని భయపడి రెండేళ్ళు ఎవరికీ కనబడకుండ పారిపోయాడు. తనవాళ్ళు, పౌర హక్కులవాళ్ళు, చిక్కడపల్లి ఎం ఎల్ ఏ, పత్రికలవాళ్ళు, తన గురించి గగ్గోలు పెడుతున్నా తాను బ్రతికి ఉన్నట్టు కూడ తెలియజేయలేదు. అంతగా భయపడ్డాడు ఆ అర్భకుడు. ఆ భయం పోవడానికి రెండేళ్ళు పట్టినట్టుంది. లేకపోతే తనకోసం వేటకు బయలుదేరిన పోలీసులకు దొరికిపోతానని భయపడ్డాడో.

అరెస్టు చేసిన 24 గంటలలో కోర్టులో పెడితే పోయేదానికి, అతన్నీ అతని వాళ్ళనూ ఇంతటి మానసిక క్షోభకు గురిచేసిన రాక్షసులను చూస్తే "పాపం, పోలీసులు" అనిపిస్తోందా?

## విశాఖపట్నం : స్వర్ణలతను 'మాయం' చేసారా?

ఈ సంవత్సరం ఏప్రిల్ 26వ తేదీన విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని లంకపోకల గ్రామం దగ్గర ఒక "ఎన్‌కౌంటర్" జరిగి సోమయ్య అనే కార్యకర్త, ఒక పోలీస్ జవాను మరణించారు. అదే సమయంలో సోమయ్యతోబాటు ఉన్న స్వర్ణలత అనే అమ్మాయి ఇప్పటిదాకా కనబడడంలేదు. పోలీసులు ఆమెను అరెస్టుచేసి తీసుకుపోయారేమోనని అప్పుడు అనుకోవడం జరిగింది గాని, మూడు నెలలు గడిచినా ఆమెను ఏ కోర్టులోనూ హాజరు పెట్టకపోయేసరికి సహజంగానే అనుమానాలు వస్తున్నాయి. స్వర్ణలతను పోలీసులు "మాయం" చేసారా?

తాము సోమయ్యతోబాటు ఒక "ఆడ నక్సలైట్"ను కూడ చంపేసినట్టు పోలీసులు ప్రగల్భాలు పలుకుతూ జనాన్ని బెదిరిస్తున్నారని ఆ ప్రాంతపు బగత గిరిజనులు అంటున్నారు. అయితే "ఎన్‌కౌంటర్"లో ఇద్దరు కాక ఒకరినే చంపినట్టు ప్రపంచానికి ప్రకటించారు కాబట్టి ఆ "ఆడ నక్సలైటు"ను అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేసి చంపేసారనీ, శవాన్ని ఆ అడవిలోనే ఎక్కడో రహస్యంగా దహనం చేసారనీ అనుమానించవలసి ఉంటుంది.

---

ఇక్కడ :-

పౌరులు చేసే నేరాలను - వ్యక్తిపరమయిన హింసను [illegible]లతో సహా నిర్వచించే శిక్షాస్మృతులు-శాసనాలు, వాటిని పరిశోధించేందుకు కోట్లాది రూపాయల వ్యయంతో నిర్వహించబడుతున్న ప్రభుత్వ-పోలీస్ యంత్రాంగాలు, వాటిని విచారించి శిక్షించేందుకు న్యాయ స్థానాలు ఉన్నాయి—

ఇక్కడ :-

ప్రభుత్వ - పోలీస్ యంత్రాంగం పౌరులమీద, పౌర హక్కులమీదచేసే అత్యాచారాలు-అమలు చేసేహింసకు సంబంధించిన శాసనాలు అతి తక్కువ. అవి ఆచరణలో మాత్రం నామ మాత్రమే. అందుకే ఈ పౌరహక్కుల ఉద్యమం—